www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

5

వైఎస్ఆర్

అనురాగ్ ప్రీతంకు ఫీడే ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్

ప్రజాశక్తి - కడప

కడపకు చెందిన 13 ఏళ్ల మేకల అనురాగ్ ప్రీతం ఫీడే ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్‌ను అందుకున్నాడు. జనవరిలో చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన చెన్నై ఇంటర్నేషనల్ ఫీడే క్లాసికల్ రేటింగ్ చెస్ టోర్నమెంటులో అనురాగ్ ప్రీతం పాల్గొని రేటెడ్ ప్లేయర్స్‌పై 2.5 పాయింట్లు స్కోరు చేసి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య ఫీడే ఫిబ్రవరి రేటింగ్ లిస్ట్‌లో అనురాగ్ ప్రీతంకు రేటింగ్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ అనురాగ్ ప్రీతం విజయాన్ని ప్రశంసించారు.

జడ్పి చైర్మన్‌కు పదవీ గండం?

- ఎంపీని కలిసిన జడ్పిటిసిలు
- జగన్ దృష్టికి తీసుకెళ్లిన అవినాష్
- జడ్పి మీటింగ్ అనంతరం కీలక పరిణామాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ చైర్మన్ జేష్టాది శారదకు పదవీ గండం ఏర్పడనుంది. ఇటీవల ఆరుగురు వైసిపి జడ్పిటిసిలు చైర్మన్ శారదను కలవనున్నట్లు సమాచారం ఇచ్చినప్పటికీ ఖాతరు చేయకుండా వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైనట్లు సమాచారం. సదరు జడ్పిటిసిలు చైర్మన్ వ్యవహార సరళిని సీరియస్‌గా తీసుకుని వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, కడప ఎంపీ వైఎస్. అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎంపీ స్పందించి జడ్పిటిసిలు అందరూ రావద్దని, ఐదారుగురు మాత్రమే రావాలని సూచించడంతో ఆరుగురు జడ్పిటిసిలు మాత్రమే వెళ్లి కలిసి చైర్మన్‌ను మార్చాలని పట్టుబట్టినట్లు సమాచారం. ఎంపీ స్పందిస్తూ వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వ్యవహారాన్ని తీసుకెళ్తానని హామీనిచ్చినట్లు తెలిసింది. గురువారం జడ్పి చైర్మన్ అభ్యర్థి మార్పునకు సంబంధించిన విషయమై జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

రేసులో ముగ్గురు...

జడ్పి చైర్మన్ స్థానానికి ముగ్గురు జడ్పిటిసిలు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. చింతకొమ్మదిన్నె జడ్పిటిసి నరేన్ రామాంజనేయరెడ్డి, బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి రామగోవిందరెడ్డి, మరో బిసి అభ్యర్థి పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. నాలుగు నెలల కిందట రామగోవిందరెడ్డి పేరును అధిష్టానం ఖరారు చేసిన సంగతి తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లో రెగ్యులర్ జడ్పి చైర్మన్ స్థానానికి నోటిఫికేషన్ ఇవ్వాల్సిన ఉంది. ఉద్దేశ పూర్వకంగానే నోటిఫికేషన్ ఇవ్వని నేపథ్యంలో వైసిపి నాయకత్వంలో ఊగిసలాట నెలకొంది. వైసిపి జడ్పిటిసిలు రోడ్డుకెక్కి అవకాశాల్ని భంగ పరుచుకోవడం సరికాదనే ఉద్దేశంతో మిన్నకుండి పోయినట్లు తెలుస్తోంది. జడ్పి చైర్మన్ వ్యవహార సరళి నేపథ్యంలో ఆమెను మార్పు చేయాలని తాజాగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది.

మార్చితే సరే...

జడ్పి చైర్మన్ శారదను మార్చితే సరేనని, మార్చకపోతే అసమ్మతినే అస్త్రంగా దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు తరహాలో వ్యవహరం ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ఎనిమిది మంది జడ్పిటిసిలు జారిపోయిన నేపథ్యంలో మరికొందరు జారిపోయే అవకాశాలు ఉన్నాయనడంలో సందేహం లేదు. వైసిపి అధిష్టానం చైర్మన్‌ను మార్చేందుకు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు ఉన్నాయి. ఎనిమిది నెలలుగా ఎస్సీ అభ్యర్థి చైర్మన్ పగ్గాలు చేపట్టారని, మిగిలిన కాలాన్ని తమకు ఇవ్వాలని బిసి అభ్యర్థులు పట్టుబడుతున్నట్లు సమాచారం. జగన్ సమీప బంధువు, చింతకొమ్మదిన్నె జడ్పిటిసి నరేన్ రామాంజనేయరెడ్డి, ఆర్మెళ్ల కిందట బి.మఠం జడ్పిటిసి రామగోవిందరెడ్డిని వైసిపి అధిష్టానం ఎంపిక చేసిన నేపథ్యంలో చైర్మన్‌గిరీ ఎవరికి దక్కుతుందోననే ఉత్కంఠ నెలకొంది.

ఉమ్మడి జిల్లాకు సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులు

- దిగువగోవిందపల్లిలో 300, చింతకుంటలో 200 మెగావాట్లు
- మంత్రివర్గ సమావేశంలో ఆమోదం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో పలు సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులను ఏర్పాటు ప్రతిపాదనలకు మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన విజయవాడలో నిర్వహించిన కేబినెట్ మీటింగ్‌లో సోలార్, పునరుజ్జీవ ఇంధన ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కడప జిల్లాలోని దిగువగోవిందపల్లిలో సాయెల్ ఎంహెచ్‌పి-2 ప్రయివేటు లిమిటెడ్ సంస్థ 300 మెగావాట్లు సామర్థ్యం కలిగిన సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును, పునరుజ్జీవ ఇంధన విభాగంలో కడప రెన్యుపబుల్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ క్లీన్‌ఎనర్జీ, కడప జిల్లాలో 300 మెగావాట్ల ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి అనుమతించింది. అన్నమయ్య జిల్లాలోని చింతకుంట గ్రామీణ ప్రాంతాల్లో మెగా ఇంజినీరింగ్ సంస్థ 200 మెగావాట్లు సామర్థ్యం కలిగిన ఇంధన ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. 2014-2019 టిడిపి హయాంలోని నీరు-చెట్టు పథకంలో అక్రమాలకు పాల్పడిన పలువురు ఇంజినీరింగ్ అధికారులపై తీసుకోవాల్సిన క్రమశిక్షణా చర్యలను నిలుపుదల చేసింది.కడప జిల్లాలోని ఇరిగేషన్ రెగ్యులర్ విభాగంలో 120 పనులు, మైనర్ ఇరిగేషన్ విభాగాల పరిధిలో 140 పనులు వెరసి మొత్తం 260 నీరు-చెట్టు పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసిపి హయాంలో విజిలెన్స్ తనిఖీల్లో తేలిన సంగతి తెలిసిందే. ఉభయ జిల్లాలోని పలువురు ఇరిగేషన్ ఇంజినీర్లపై తీసుకోవాల్సిన డిసిప్లనరీ యాక్షన్ మినహాయించడంతో కడప, అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల దగ్గర నుంచి డివిజన్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీరింగ్ అధికారులకు ఉపశమనం లభించినట్లు అయిందనడంలో స దేహం లేదు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

10న ఇంటింటి న్యాయ ప్రచారం

ప్రజాశక్తి - కడప

ఈనెల 10 నుండి 24వ తేదీ వరకు ఇంటింటి న్యాయ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. గురువారం కడప రిమ్స్ ఆవరణలో పున్న జిల్లా సత్వర చికిత్స కేంద్రం, జిల్లా బాల భవిత కేంద్రాన్ని టీం సభ్యులతో కలిసి సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పుట్టినప్పటి నుచి 18 సంవత్సరాల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు వారి తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇందుకోసం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుందన్నారు. ఇంటింటి ప్రచారంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు 11 టీమ్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇందులో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీరీలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, వైద్యాధికారులు, భవితా సెంటర్ నిర్వాహకులు మొదలైన వారు పాల్గొంటారు అని అన్నారు. కార్యక్రమంలో కడప, ప్రొద్దుటూరు డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ అధికారి శ్రీరమేష్, ప్రోగ్రాం మేనేజర్ నవీన్ కుమార్, పీడియాట్రిక్ డాక్టర్ విష్ణు వందన, వైద్యులు సిబ్బంది, పానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

యాదవ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : యాదవ భవన్ నిర్మాణానికి కడపలో స్థలం కేటాయించాలని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ యాదవ్ కోరారు. గురువారం ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టంపల్లి ప్రాంతంలో 83 సెంట్ల స్థలం ఫీజిబిలిటీ రిపోర్టులో పొందుపరిచారని తెలిపారు. ఈ స్థలాన్ని కేటాయించాలని జెసికి వినతిపత్రం అందజేశామని చెప్పారు. స్పందించిన ఆర్‌డిఒ ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. స్థలం కేటాయిస్తే భవనాన్ని నిర్మించుకుంటామని తెలిపారు. 9 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో పాములేటి యాదవ్, రామమూర్తి యాదవ్, శివశంకర్ యాదవ్, బాబు యాదవ్, ఎల్లయ్య యాదవ్, గోపాలయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల సెమినార్ హాల్‌లో కడప జిల్లా ఇంటర్ ప్రాక్టికల్ సంబంధించి సైన్స్ జూనియర్ లెక్చరులకు విధి విధానం, ప్రాక్టికల్ మార్కులు గురించి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి రవి, ఆర్ఐఒ బి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు 14 కేంద్రాలలో, 10 నుంచి జనరల్ ప్రాక్టికల్స్ 78 కేంద్రాల్లో ప్రారంభమై 20వ తారీకుతో ప్రాక్టికల్ పరీక్షలు ముగిస్తాయని పేర్కొన్నారు. పరీక్షలలో ఎటువంటి అవకతవకలకు నిర్వహించాలని చెప్పారు. సదస్సులో జిల్లా స్పెషల్ ఆఫీసర్ మురళి, డిఇసి సభ్యులు ప్రాక్టికల్ గురించి తగు సూచనలు చేశారు.

ఖాసింఖాన్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఖాసింఖాన్‌ను సన్మానిస్తున్న పీఠాధిపతి

రవీంద్ర నగర్‌లో ఉన్న షామీరియా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక ఇస్తేమా కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందజేసిన సీనియర్ ఆడిటర్ లయన్ ఖాసిం ఖాన్‌ను పీఠాధిపతి అహమ్మద్ పీర్ షామీరి సన్మాని ంచారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ షరీఫ్ ఖాన్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ కూల్చివేతను అడ్డుకున్న మేయర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని మాసాపేటలో నిబంధనలను అతిక్రమించి వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారని కూల్చడానికి వచ్చిన కార్పొరేషన్ సిబ్బందిని మేయర్ సురేష్‌బాబు అడ్డుకున్నారు. వాటర్ ప్లాంట్ నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నా యని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం చూడలేక ఇలాంటివి చేపడుతోందని విమర్శించారు. అధికారులే అనుమతులు ఇచ్చి, ఇప్పుడు ఆక్రమణలు అని చెప్పడం ఎంతవరకు సమంజసం ఉన్నారు. పెద్ద ఎత్తున పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ప్రతి ఇంటా ప్రగతే పి-4 పాలసీ లక్ష్యం

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటినీ ప్రగతి పథంలో నడిపించి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పి-4 పాలసీని అమలు చేస్తోందని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా దూరం చేసే దిశగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయనున్న పి-4 ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగా హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జెఇ అదితిసింగ్, జడ్పి సిఇఒ ఓబులమ్మ, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జీరో పావర్టీని సాధించే దిశగా ముఖ్యమంత్రి రానున్న ఉగాది రోజు ప్రారంభించ తలపెట్టిన పి-4 (పబ్లిక్ పీపుల్ ప్రయివేట్ పార్ట్నర్ షిప్) పాలసీ అమలు పై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. అందులో భాగంగా జిల్లా జనాభాలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు అత్యంత ప్రాధాన్యతతో ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎస్‌జిఒలు, ఎన్‌ఆర్ఐలు, వ్యాపారులు, స్థానిక నాయకులు, వివిధ రంగాల నిపుణులను భాగస్వామ్యం, వారి నైపుణ్యం, వనరులు, మార్గదర్శకత్వాన్ని పంచుకోవడం ద్వారా పేద కుటుంబాలను

విసిలో పాల్గొన్న కలెక్టర్, జెసి

ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో చేపట్టి అత్యంత విజయవంతంగా నిర్వహించిన 'జన్మ భూమిని స్ఫూర్తిగా.. జీరో పావర్టీ, పి-4, నియోజకవర్గ విజన్ ప్లాన్‌ను ఒక సమిష్టి శక్తిగా అమలు చేయాలన్నారు. అందుకు సంబంధించి రాబోయే 30 రోజుల్లో, ప్రభుత్వం జీరో పావర్టీలో భాగంగా పి-4 విధానంపై అందరి ఆలోచనలు, అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. ప్రతి ఒక్కరి అవసరాలు, ఆకాంక్షలను ప్రతిబింబించే విధానాన్ని రూపొందించడంలో ప్రతి ఒక్కరూ అంతర్భాగంగా చొరవ చూపాలన్నారు. ప్రణాళికలో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాన్ని సేకరించడానికి పబ్లిక్ కన్సల్టేషన్ కోసం రూపొందించిన ప్రశ్నపత్రం సర్వేను ప్రణాళికా విభాగం రూపొందిస్తుందన్నారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరి 7 నుంచి 22 వరకు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సర్వేలో జిల్లా పౌరులను భాగస్వామ్యం చేసే లక్ష్యంగా చర్యలు చేపడుతామన్నారు.

పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్

మురుగు కాలువలు శుభ్రం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో మురుగు కాలువలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయించాలని కమిషనర్ మనోజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నగరంలో అధికారులు, పారిశుధ్య కార్మికులు చేస్తున్న పనులను పరిశీలించారు. మారుతినగర్, నాగరాజుపేట, అశోక్‌నగర్ ప్రాంతాలను శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులతో పరిశీలించారు. మారుతి నగర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్ర అధికారులకు పలు సూచనలు చేశారు. రోజూ ఉదయాన్నే రోడ్డు శుభ్రం చేయించాలని, మధ్యాహ్న సమయంలో డ్రెయినేజీ, వ్యర్థాలను తీసివేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాగరాజుపేట నారాయణ కళాశాల బ్రిడ్జి వద్ద నుంచి ఆర్‌టిసి సర్కిల్ వరకు రోడ్డు ఇరువైపులా ఎటువంటి ఆక్రమణలు, ఫుట్‌పాత్‌పై ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అశోక్‌నగర్ ప్రాంతాలను అధికారులతో పరిశీలిస్తూ గార్బేజ్ పాయింట్లను ఎప్పటికప్పుడూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న పందులను వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని మలేరియా విభాగా అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రమణ, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగమే సంస్థ అభివృద్ధికి మూలం

మాట్లాడుతున్న ఎంవిఐ శేఖర్‌రావు

ప్రజాశక్తి - గోపవరం

ఆదర్శ ఉద్యోగమే సంస్థ అభివృద్ధికి మూలమని బద్వేల్ ఎంవిఐ ఎంవిఐ శేఖర్ రావు పేర్కొన్నారు. బద్వేల్ ఆర్‌టిసి డిపో ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రతా ఉత్సవాల సందర్భంగా గురువారం డిఎం నిరంజన్ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంవిఐ మాట్లాడుతూ ఆదర్శంగా విధులు నిర్వహించడం వల్ల సంస్థ అభివృద్ధి అభివృద్ధిలో పయనిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంస్థలో ఉద్యోగులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే సంస్థకు మనుగడ సాధ్యమని వ్యాఖ్యానించారు. డిపో మేనేజర్ ఆర్.సి. నిరంజన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమిష్టి కృషి ఫలితమే ఇపికె, కెఎంపిఎల్‌లోనూ సంక్రాంతి స్పెషల్ బస్సులు తిప్పడంలోనూ రెండవ స్థానంలో ఉన్నామని, ఆ కృషి ఫలితం ఉద్యోగులకే చెందుతుందని చెప్పారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో బాధ్యతాయుతంగా నడుచుకోవడం మూలానే మనం ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. బస్సులను ఎప్పటికప్పుడూ కండిషన్లలో ఉంచుతూ సహకరిస్తున్న మెకానిక్‌లను అభినందించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సులను ఏర్పాటు చేయడంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బిఎస్ నాయక్ గారి కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు అసోసియేషన్ నాయకులు కండక్టర్లు, డ్రైవర్లు మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎపిజిబి'ని కడపలోనే కొనసాగించాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న విజయజ్యోతి

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోని కొనసాగించాలని డిసిసి అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించొద్దు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రైతులకు, కర్షకులకు,మధ్యతగతి ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని చెప్పారు. కరవు, పీడిత ,వెనుక బడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి, ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా కడపలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను 28 కుదింపులో భాగంగా కడపలో ఉన్న ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలని చూస్తోందని, ఆలోచనలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - వల్లూరు : మండలం పరిధిలోని బాలుగారిపల్లిలో ఈనెల 8న శనివారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుర్రంపాటి విశ్వనాథరెడ్డి, ఇంది రెడ్డి రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని శ్రీ సీతారాముల విగ్రహ మహోత్సవం సందర్భంగా బాలు గారి పల్లిలో న్యూ కేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి రూ. 50116, రెండవ బహుమతి రూ.40116, మూడవ బహుమతి రూ. 30116, నాలుగవ బహుమతి రూ. 20116, ఐదవ బహుమతి రూ. 15116,0 ఆరవ బహుమతి రూ. 10116, ఏడవ బహుమతి రూ. 5116 ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు 84466085273, 7639778726, 6302584234లలో సంప్రదించాలని కోరారు.

బిటెక్ విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - బద్వేలు

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ మహిళా నాయకులు

ప్రొద్దుటూరు మండలంలోని సిబిఐటి కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డివైఎఫ్ఐ మహిళా కన్వీనర్ గురుదేవి డిమాండ్ చేశారు. గురువారం బద్వేల్ పట్టణంలోని డివైఎఫ్ఐ కో -కన్వీనర్ నాగేశ్వరి, ఐద్వా మహిళా సంఘం బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అనంతమ్మ ,రత్తమ్మలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లికి చెందిన వైష్ణవి అనే విద్యార్థి చాపాడు మండలంలోని సిబిఐటి కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుందని చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అనేక మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, అధిక ఫీజులతో విద్యార్థుల జీవితాలతో, ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమని, ఇప్పటికైనా అధికారులు, పోలీసు అధికారులు విద్యార్థి మృతికి గల కారణాలు తెలుసుకొని చర్యలు తీసుకోవాలని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు.

గోల్డ్ మెడల్ గ్రహీతకు విసి ప్రశంస

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ ఉర్దూశాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నజిమున్నీసా నాజ్‌ను విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, శాఖాధిపతి ఆచార్య కె. రియాజున్నీసా అభినందించారు. డాక్టర్ నజి మున్నీసా నాజ్ 'దిల్లీ ఉర్దూ వర్సిటీ లిటరసీ ఫోరం బెజ్మీ సుర్కీల్ ఆదాబ్ ఇంటర్నేషనల్ సయ్యద్ అబ్దుల్ హమీద్' సంస్థ నుంచి ఇటీవల గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జెసికి వినతి పత్రం అందేస్తున్న గౌస్‌పీర్

ప్రజా సమస్యలను పరిష్క రించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి, గౌస్‌పీర్ సేన అధ్యక్షులు సయ్యద్ గౌస్‌పీర్ కోరారు. గురువారం జెసి అదితి సింగ్‌కు ఆమె ఛాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్, రోడ్లు, భూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వికలాంగులకు పెన్షన్ రాకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని విమర్శించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలి

ప్రజాశక్తి - గోపవరం

స్కూల్ బస్సులకు కచ్చితంగా ఫిట్‌నెస్ సర్టికెట్ ఉండాలని బద్వేల్ అర్బన్ సిఐ ఎం. రాజగోపాల్ పేర్కొన్నారు. గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పోలీస్, రవాణా, అగ్నిమాపక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌టిఒ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల నేపథ్యంలో స్కూల్స్ బస్ డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు సెఫ్టీపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగంగా నడపడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఎంవిఐ శేఖర్ రావు మాట్లాడుతూ మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవ్ చేయకూడదని సూచించారు. ఎవరైనా ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించక పోతే వారిపై చట్టపరమైన చర్యలు చేసుకుంటామని చెప్పారు. నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై పోలీస్, ఆర్‌టిఒ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. మాక్ డ్రిల్ నిర్వహించి చేపట్టాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక అధికారి చంద్రుడు వివరించారు. కార్యక్రమంలో బద్వేలు ఎస్.ఐ సత్యనారాయణ, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది, స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి

ప్రొద్దుటూరు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ సమేత హనుమత్ విగ్రహ శిఖర ప్రజా ప్రతిష్ఠ మహోత్సవ ప్రారంభ పూజా కార్యక్రమంలో గురువారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్. వరద రాజులరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శెట్టిపల్లె రాం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం, అన్నదాన కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేపడుతున్నారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌డిఎ కమిషనర్ రామసుం దర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సివి సుబ్బారెడ్డి, అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

- వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వ్యవసాయానికి 9 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఇవ్వాలని వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. మస్తాన్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగిస్తామని రైతులకు హామీ ఇచ్చిం దన్నారు. ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ 7 గంటలు మాత్రమే సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేయడం దురదృష్ట కరమన్నారు. అరటి ధరలు ఎక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా 7 గంటలకు కుదించడం బాధాకరమన్నారు. విద్యుత్తు అధికారుల నిర్ణయంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని తెలిపారు. రైతుల నడ్డి విరిచేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సాగులో ఉన్న అరటి పంటను దృష్టిలో ఉంచుకుని మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు కృషి చేయాలని కోరారు.

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థికి రెండవ బహుమతి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎపి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి చరిత రెండవ స్థానంలో బహుమతి సాధించినట్లు పాఠ శాల కరస్పాండెంట్ చక్ర పాణిరెడ్డి చెప్పారు. గురువారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో చరితను పాఠశాల డైరెక్టర్ చేతన్‌రెడ్డి అభినం దించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల సం దర్భంగా గత నెల 13 వతేదీ నుంచి 30వ వరకు నిర్వహించిన 'పెంపుడు జం తువుల సంరక్షణ' అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో చరిత ప్రతిభ చూపినట్లు చెప్పారు. పెంపుడు జంతువుల సంరక్షణలో ఆహారం, ఆరోగ్యం, నివాసం, వ్యాయామం, ప్రేమ వంటి అంశాలపై తన వ్యాసంలో వివరించినట్లు చెప్పారు.

చరితను అభినందిస్తున్న డైరెక్టర్ చేతన్‌రెడ్డి

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వ సలహాదారు షరీఫ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్ అన్నారు. పట్టణంలోని ఉర్దూ జూనియర్ కళాశాలను మౌలానా ఆజాద్ వీధిలోని, జిన్నా మోటులోని ఉర్దూ పాఠశాలలను, అమృత్ నగర్‌లోని ఉర్దూ రెసిడెన్సియల్ పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం షరీఫ్ విలేకరులతో మాట్లాడుతూ స్థానికంగ ముస్లిం మైనార్టీల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ అందుకు తగ్గ అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఉర్దూ విద్యాలయాలను పరిశీలించామన్నారు. సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. మౌళిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. ఉర్దూ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా చేసి రెసిడెన్సియల్ స్కూల్‌గా చేయాలని ప్రతిపాదన ఉందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రూ.8కోట్ల రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. వ్యాపారాభివృద్ధికి రూ.5లక్షల గరిష్ఠంగా మంజూరు చేస్తామన్నారు. ప్రాథమికంగా రూ.500కోట్లు రుణసదుపాయం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇమాం, మౌజన్‌లకు పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనం మంజూరు చేస్తామన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను పరిరక్షిస్తామన్నారు. తన పర్యటనలో పరిశీలించిన అంశాలన్నింటినీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మంచి ఫలితం వచ్చేలా కృషి చేస్తానని షరీఫ్ అన్నారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, టిడిపి సీనియర్ నాయకులు సురేష్‌నాయుడు ఉన్నారు.

వేంపల్లె : కూటమి ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి ఆయా పథకాలు అమలు చేస్తోందని ఎపి ప్రభుత్వ సలహాదారుడు ఎంఎ షరీఫ్ పేర్కొన్నారు. స్థానిక కుప్పాలపల్లె రహదారిలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలను ఆమర సందర్శించారు. విద్యార్థులకు ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు.ముస్లిం మైనార్టీల సమస్యలపై టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి ఇమ్రాన్ ఖాన్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ పర్వీన్ తాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, టిడిపి నాయకులు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల అభివృద్ధికి సహకరించండి

- మంత్రులతో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని టిడిపి పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కోరారు. ఆ మేరకు గురువారం అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితకు పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వేంపల్లె మండల టిడిపి పరిశీలికుడు అజ్జగుట్టు రఘునాథరెడ్డి, పులివెందుల మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకట్రామిరెడ్డి, వేంపల్లె మండల టిడిపి అధ్యక్షుడు మునిరెడ్డి పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చాపాడు

రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ కోరారు. రైతు సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ రమాకుమారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచార సమయంలో రైతులకు రైతు భరోసాగా ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే ఇచ్చి ఆదుకోవాలన్నారు. జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన తెలుగుగంగ, రాజోలి, హంద్రి-నీవా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే వాటిని పూర్తి చేసి ఆయకట్టు రైతులకు సాగు నీరు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షులు అన్నవరం వెంకటేశ్వర్లు, చాపాడు మండల రైతు నాయకులు కేతవరం వెంకటసుబ్బారెడ్డి, కొనిరెడ్డి రామాంజనేయరెడ్డి, ఎం.ప్రసాద్, ఎన్.గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే ఆగుతున్న బస్సులు

ప్రారంభానికి నోచని బస్టాండ్.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.. ప్రజలకు అసౌకర్యం

రోడ్డుపై నిలిచిన ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో నూతనంగా నిర్మించిన ఆర్‌టిసి బస్టాండ్ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో బస్సులు రోడ్డుపైనే ఆపుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అటుఇటు వెళ్లే వాహనదారులు తీవ్ర అసౌ కర్యానికి గురవుతున్నారు. వేంపల్లెలో నూతనంగా నిర్మించిన ఆర్‌టిసి బస్టాండు పనులు పూర్తయినా అది ,కారులు ప్రార ంభించలేదు. కడప-పులివెందుల-రాయచోటి- ప్రొద్దు టూరు-తిరుపతి-చెన్నై, అనం తపురానికి వెళ్లే బస్సులు అన్ని బస్టాండు బయటే ఆపుతున్నారు. ప్రయాణికులను దించడం, ఎక్కించుకోవడం చేస్తున్నారు. ఉదయం పూట ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఉదయం వేళల్లో అటు వైపు వెళ్లే బస్సులు, ఇటు వైపు వెళ్లే బస్సులు ఒక్కసారి వచ్చి నిలుస్తుడడంతో మధ్యలో ఇతర వాహనాలు వెళ్లలేక పోతున్నాయి. ప్రయాణికులు కూడా బస్సులు ఎక్కాలంటే ఇబ్బందిగా మారింది. మరో వైపు బస్సుల కోసం రోడ్డపైనే ప్రయాణికులు నిలుస్తు డడంతో ఆర్‌టిసి బస్టాండు ప్రాంతం రద్దీగా మారుతోంది. ఈ హడావుడిలో ప్రమాదాలు జరుగుతాయేమోనని ప్రయా ణికులు హడలిపోతున్నారు. ప్రొద్దుటూరు, రాయచోటి వైపు నుండి వచ్చే బస్సులు ప్రయాణికులను ఎక్కించుకొనేందుకు ప్రొద్దుటూరు బస్సులు సాయి బాబా గుడి వద్ద తిప్పుకోవాల్సి వస్తోంది. రాయచోటి బస్సులు క్రిష్టియన్ కాలనీ వద్ద తిప్పుకుంటున్నారు. ఈ సమయంలో వెనుకవైపు వస్తున్న వాహ నాలు ప్రమాదానికి గురవుతున్నాయి. బస్సు డ్రైవర్లు కూడా ఇబ్బందులు పడు తున్నారు. ఆర్‌టిసి బస్టాండును ప్రారంభిస్తే ఇలాంటి కష్టాలు తొలగి పోతాయని డ్రైవర్లు వాపోతున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వెళితే ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తదు. బస్సుల కోసం రోడ్డపైనే దుమ్ము, దూళిని భరిస్తూ నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. బస్సుల కోసం వేచి ఉంటున్న ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతోపాటు కూర్చోవడానికి స్థలం లేదు. బస్సు వచ్చే వరకు నిల్చోని ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు అధికారులపై, ప్రజా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ ఉన్నతా ధికారులు స్పందించి తమ కష్టాలు తీర్చాలని బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

త్వరలో ఆర్‌టిసి బస్టాండ్ ప్రారంభం : పులివెందుల ఆర్‌టిసి డిఎం

వేంపల్లెలో నిర్మించిన నూతన బస్టాండుకు సంబంధించి ఫర్నిచర్ సరఫరా చేసినట్లు పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం వేంపల్లె బస్టాండుకు చెందిన ఫర్నిచర్‌ను డిఎం సమక్షంలో సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లా డుతూ త్వరలోనే వేంపల్లెలోని నూతన బస్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసు కొనున్నట్లు తెలిపారు. హైదరాబాదుకు సంబంధించిన బస్సు సర్వీస్‌పై విలేక రులు అడుగగా.. లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని, ప్రయాణికులు లేనం దున ఆ బస్సు సర్వీసు రద్దు చేసినట్లు తెలిపారు. ఇడుపులపాయకు ఉద యం, సాయంత్రం రెండు పూటలా సర్వీసును కొనసాగించాలని స్థానిక ప్రజలు, విద్యార్థులు కోరారు. దీనిపై పునరాలోచన చేస్తామని డిఎం పేర్కొ న్నారు. ఇంతవరకు సంబంధిత కాంట్రాక్టర్ తమకు బస్టాండ్‌ను అప్పజెప్ప లేదన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌టిసి డిపో సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌కు చేరుతున్న ఫర్నీచర్

రైతులకు నిరంతరం విద్యుత్ అందించాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

రైతులకు నిరంతరం విద్యుత్ అందించాలని ఆ శాఖ ఎస్ఇ ఎస్.రమణ సూచించారు. మం డలంలోని మల్లేపల్లి సబ్‌స్టేషన్, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ఈ సందర్భంగా సిబ్బం దికి తగు సూచనలు చేశారు. మండల విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహిం చారు. ఇళ్ల విద్యుత్ బిల్లులు తగ్గిం చుటకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా గృహాలకు రూప్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిం చాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పని చేయాలన్నారు. రైతుల విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. వినియోగదారులతో మమేకమై వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావ ధానంగా విని పరిష్కరించాలన్నారు. పగటిపూట వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదన్నారు.

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టండి..

ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, వీటిని తగ్గించాలని ఎస్ఇ రమణ హెచ్చరించారు. ప్రతి సిబ్బంది నెలకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల ప్రకారం నిర్వహణ పనులు చేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి తెలిపారు. పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవని ఎస్ఇ హెచ్చరించారు. సమావేశంలో మైదుకూరు ఇఇ భరణికృష్ణ, డిఇఇ కుళాయప్ప, ఎఇ రవిశంకర్, జెఇ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి కృషి చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

గ్రామ రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేయాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ సూచించారు. మండలంలోని కొత్తపల్లె గ్రామంలోని బియ్యం గోడౌన్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులు బియ్యం, కందిబేడలు, చక్కెర పంపిణీ విధానాన్ని, స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలకు రేషన్ సకాలంలో పంపిణీ చేయాలని గోడౌన్ సిబ్బందికి సూచించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. అర్జీలను క్వాలిటీ ఎండార్స్ మెంట్ ఇచ్చి పూర్తి చేయాలన్నారు. అర్జీలను సకాలంలో పూర్తిచేయాలని తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డిని ఆదేశించారు. భూ రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సిబ్బంది నిర్వహించే విధి విధానాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హర్షవర్ధన్‌రాజు, ఆర్ఐ లక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ సుజీత్, విఆర్ఒలు రాజశేఖర్, ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ కిషోర్ పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

ప్లాస్టిక్ కవర్లను వాడరాదు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను వాడరాదని నగర పంచాయతీ కమిషనర్ శేషఫణి ఆదేశించారు. పట్టణంలో గురువారం పలు దుకా ణాలను కమిషనర్ తనిఖీ చేసి ప్లాస్టిక్ వాడుతున్న వారిపై జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వల్ల కాలు వలు పూడిపోతున్నాయన్నారు. ప్లాస్టిక్ నుంచి విడుదలయ్యే రసాయనాలతో పరిసర నీటి వన రులు విషపూరితమవుతాయని పేర్కొన్నారు. నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బిఎస్‌పి అధ్యక్షుడిగా రవికుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కడప జిల్లా బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ కమిటీలో భాగంగా గురువారం ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షులుగా తిట్ల రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ మేరకు స్థానికంగా జిల్లా అధ్యక్షుడు జయరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పొద్దుటూరు కమిటీని ప్రకటించారు. నియోజకవర్గ కన్వీనర్‌గా బొజ్జ ఆనందరావు, కె.పవన్‌కుమార్, ఉపా ధ్యక్షు లుగా కె.నరసింహులు, కోశాధికారిగా పట్టం మహబూబ్ బాషా, పట్టణ కన్వీనర్‌గా లక్ష్మమ్మ, సైక్ జరీనా, తీట్ల రాజ్‌కుమార్‌ను ఎన్ను కున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబన్న, జిల్లా సెక్రటరీ బాలచంద్ర, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో పారదర్శకంగా ఉండాలి : డివైఎఫ్ఐ

జమ్మలమడుగు రూరల్ : ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బిసి, ఒబిసి కార్పొరేషన్ రుణాల మం జూరులో పారదర్శకత పాటించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో గురువారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ నిరుద్యోగ యువత దరకాస్తు చేసుకు న్నారని తెలిపారు. రుణాల మంజూరులో ఎలాం టి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలనానరు. నిరు ద్యోగ యువత కొన్నేళ్లుగా ప్రభుత్వ రుణాల మం జూరు కోసం ఎదురు చూస్తూన్నారన్నారు. అధికారులు పారదర్శకంగా ఇంటర్వ్యూలు జరిపి అర్హులైన అం దరికీ రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

చిరుత పులిని పూడ్చిన రైతు అరెస్టు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

లింగాల, సింహాద్రిపురం మండలాల సరిహద్దులోని రామాపురం వద్ద చిరుత పులి విద్యుత్ ఘాతానికి బుధవారం గురైన విషయం తెలిసిందే. అయితే విద్యుత్తు తీగ లను తమ పొలం చుట్టూ రైతు భరత్‌కుమార్ రెడ్డి ఏర్పాటు చేయడంతో చిరుత పులి మృతి చెందింది. వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద రైతు భరత్ కుమార్‌రెడ్డిని గురు వారం అరెస్టు చేసినట్లు ముద్దనూరు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. అనంతరం ప్రొద్దుటూరు కోర్టుకు హాజరు పరిచామని డిఆర్ఒ తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళల్లో మార్పు

సింహాద్రిపురం : మండలంలో వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు చేసినట్లు గురువారం ఆ శాఖ అసిస్టెంట్ ఇంజ నీరు దినేష్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 8.15 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు ఉంటుం దన్నారు.

ఉప కమిటీల బాధ్యతలపై శిక్షణ

వేముల : స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వేముల మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులకు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్స్ సుపరిపాలన, ఉప కమిటీల బాధ్యతలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు శ్రీలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా మాస్టర్ ట్రైనర్ వెలుగు అసిస్టెంట్ ప్రాజె క్టు మేనేజర్ ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ జ్యోతి మాట్లాడుతూ తమ విధులు, బాధ్యతలుపై స్పష్టమైన అవ గాహన కలిగి ఉండాలని సూచిం చారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లు, అసిస్టెంట్లు, కమ్యూనిటీ కో-ఆర్డి నేటర్లు, సమాఖ్య అకౌంటెంట్ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 313/ 2019

Modala Venu Gopal, S/o Satyanarayana, aged about 42 years, Hindu, Business, residing at D.No.15/465/6/5, Balaji Nagar-2, Proddatur - 516360. ...Plaintiff

Vs

Pokala Bala Krishna, S/o Ramaiah, aged 45 years, Hindu, Business, residing at Saraswathi peta, Mydukur Town and Mandal, Kadapa Dist. ...Defendant

దావా సమను

పై నెంబరు దావాను వాది, ప్రతివాది పైన రికవరికి గాను దావా దాఖలు చేయడమైనది. దావాలో ప్రతివాది అయిన నీవు పై కోర్టులో 10.02.2025వ తేదీన ఉదయం 10.30ని॥లకు నీవు గాని, నీ తరపున వకీలు గారు గానీ హాజరు కావలెను. అట్లు హాజరు కానంతట నీ పైన పరోక్షం గా తీర్మానించబడును.

వాయిదా తేది: 10.02.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

జె. రామాంజనేయులు

అడ్వకేట్స్,

ప్రొద్దుటూరు. సెల్: 9441010935.

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

తుపాకుల జనార్ధన్‌రెడ్డి, తండ్రి వెంకట నారాయణరెడ్డి, డోర్ నెం. 8/65, దొంతాపురం గ్రామం మరియు పోస్టు, చెన్నూరు మండలం, వైఎస్ఆర్ జిల్లా అయిన నేను మా అబ్బగారు (లేట్ చెన్నారెడ్డి) పేరుపైన వున్నటువంటి భూమి డాక్యుమెంట్స్ డికెటి పట్టా నెం.692/1384 dated 26.09.1984, situated at Survey No.1, Doulathapuram Village Extents 4.50 Acres, and Passbook Bearing Patta No.103 ఒరిజినల్ డికెటి పట్టా డాక్యుమెం ట్స్ 04.02.2025వ తేదీన పుట్టంపల్లి నుండి రిమ్ముకు వెళ్ళే దారిలో మిస్ అయినవి. కావున ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు పై అడ్రస్సులో కాని ఈ క్రింది నెంబర్‌కు తెలియజే యవలెను.

సెల్: 9502555253.



డిటికి ఫిర్యాదు చేస్తున్న17వ వార్డు కౌన్సిలర్ ఎరికలరెడ్డి

రేషన్ పంపిణీ వాహనం రావడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో 15,16,17 కౌన్సిలర్ వార్డుల్లో రేషన్ పంపిణీ వాహనం రావడం లేదని డిప్యూటీ తహశీల్దారు యామినికి గురువారం 17వ వార్డు కౌన్సిలర్ ఎరికలరెడ్డి, ప్రజలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముద్దనూరు రోడ్డులో రేషన్ సరఫరా చేయాల్సిన వాహనం మరమ్మతు ఉందని ఎండిఒ ఆపరేటర్ అన్నాడని స్థానికులు తెలిపారు. ఒక్కోమారు డీజిల్ లేదని.. ఇలా ఏదోక సాకుతో తరచూ రేషన్ పంపిణీకి సదరు వాహనదారుడు రావడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పనులు వదులుకొని రేషన్ కోసం షాపు వద్దకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడికి వెళితే కందిబేడలు అయిపోయాయని, మరోసారి రెండు రోజులు ఉండి రావాలంటున్నారని వాపోయారు. వాహనదారుడు వచ్చినా వీధిలో ఒకేచోట నిలబడతాడని, అందరూ వాహనం వద్దకి వెళ్లాల్సి వస్తోందని వివరించారు. సదరు వాహనదారుడిపై చర్యలు తీసుకుని ఖచ్చితంగా రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరారు.

విశ్వసనీయతపై జగన్ మాట్లాడడం హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయత, విలువలు గురించి మాట్లాడడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్వసనీయత ఉండే వారు మాట్లాడితే బాగుంటుందని తెలిపారు. జగన్‌కు లేనిదే విశ్వసనీయత అన్నారు. అనేక సందర్భాలలో విశ్వసనీయత లేనట్లు రుజువైందన్నారు. వైఎస్ఆర్ మరణానికి రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానినే కారణమని చెప్పి ఆయన ఆస్తుల మీద దాడి చేయించి, మళ్లీ ఆయన సిఫారసు చేసిన పరిమలా నత్వానీకి రాజ్యసభ సీటును జగన్ ఇచ్చాడని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు రాజధానిగా అమరావతిని ఆహ్వానించి అధికారంలోకి వచ్చాక దాన్ని విశాఖకు తరలించాలని ప్రయత్నం చేశాడని పేర్కొన్నారు. వివేకా హత్య విషయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిబిఐ విచారణ అడిగి, అధికారంలోకి వచ్చాక వద్దన్నాడని చెప్పారు. తనకు సొంత పేపర్ లేదు.. నేను పేదవాడిని అని పచ్చి అబద్ధం ఆడాడని తెలిపారు. దశలవారీగా మద్య నిషేధం అని, దశలవారీ మద్య నిషాను అమలు చేశాడని విమర్శించారు. విశ్వసనీయత గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని పేర్కొన్నారు.

వన్యమృగ సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వన్యప్రాణుల నిమిత్తం ఏర్పాటు చేసిన వన్యమృగ సంర